క్లుప్తంగా

విజయవంతం చేయండి

చొప్పదండి: వరంగల్ జిల్లాలో ఫిబ్రవరి 2 నుంచి 18 వరకు జరిగే షర్మిల పాదయాత్రను ప్రజలు విజయవంతం చేయాలని వైఎస్సార్‌టీపీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్‌వర్మ కోరారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకుల చేష్టలతో ఆగిన యాత్రను లక్షలాది మందితో తిరిగి పునఃప్రారంభించనున్నామని చెప్పారు. పోలీసులు అనుమతి ఇచ్చారని, న్యాయమే గెలుస్తుందన్నారు. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేమని ఇప్పటికైనా గుర్తించాలని హితవు పలికారు. వెంట గాదె స్రవంతి, మండల పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి రాజేందర్ రెడ్డి, అరుణ్, తిరుపతి, రవిశాస్త్రి, నాగరాజురెడ్డి, తదితరులున్నారు.

స్కూటీ, ఆటో ఢీ

నలుగురికి గాయాలు

తిమ్మాపూర్: మండలంలోని కొత్తపల్లి వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వెళ్లే రోడ్డుపై ఆటో స్కూటీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న ఇద్దరు, ఆటోలో ఉన్న ఇద్దరు గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ప్రమోద్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై విచారణ జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

సర్టిఫికెట్లు అందజేత

కరీంనగర్: నగరంలోని చైతన్యపురిలో ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కంప్యూటర్, బ్యూటీషియన్, కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 145 మంది మహిళలకు అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ శుక్రవారం కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. ప్రతీ పనిలో మీకు మెళకువ అవసరమని, కష్టపడితే ఫలితం ఉంటుందని తెలిపారు. మహిళలు విద్యలో అభివృద్ధి చెందినప్పుడే మార్పు సాధ్యపడుతుందని అన్నారు. సొసైటీ సభ్యులు ఎ.రాజా, మదర్ అన్సిస్, ప్రీతి, దీప్తి, బేస్సీ, కార్పొరేటర్ సుమరమణారెడ్డి, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, రూప, స్రవంతి, పద్మజ, సరిత,మౌనిక, అరుణ, పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమాన్ దీక్షలు

కరీంనగర్‌కల్చరల్: పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా ఈనెల 28వ తేదీ నుంచి మే 14 వరకు 108 రోజులు హనుమాన్ దీక్షలు ప్రారంభిస్తున్నట్లు శ్రీహనుమాన్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోగ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పలు ఆలయాల్లో దీక్షా స్వీకరణలు చేయవచ్చని, పూర్తి వివరాలకు 9908692567 నంబరులో సంప్రదించాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం ముద్రించిన 2023 క్యాలెండర్‌ను శుక్రవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఆ సంఘం నాయకులు బూస అంజయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఐలేందర్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు రాజన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుచ్చన్న, సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, రాజు, యాదవ్ హక్కుల పోరాట సమితి అధ్యక్ష, కార్యదర్శులు మల్లయ్య, కొమురయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంచాల రవీందర్ పాల్గొన్నారు.

అల్పాహారం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని ఇటుక బట్టీ కార్మికులు, పిల్లలకు శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు సురేశ్, మెతుకు సత్యం, చింతల కిషన్, సుమన్, చక్రాధర్, వెంకటరమణారెడ్డి, నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ చల్మెడ ఆనందరావు ఆస్పత్రిలో నర్సయ్యపల్లికి చెందిన సుంక సుగుణకు శుక్రవారం శస్త్ర చికిత్స చేసేందుకు రక్తం అవసరమైంది. ఆమె బంధువులు వైకే ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర హరీశ్‌గౌడ్‌ను సంప్రదించారు. ఫౌండేషన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు న్యాలం అనిల్ ఆస్పత్రికి వెళ్లి రక్తం అందించాడు. సకాలంలో రక్తదానం చేసిన అనిల్‌ను రోగి బంధువులు, ఫౌండేషన్ సభ్యులు అభినందించారు.

పనులు ప్రారంభం.. రైతుల ఆనందం

- మిడ్‌మానేరు, తోటపల్లి రిజర్వాయర్ కాలువల నిర్మాణానికి రెండేళ్లకు తొలగిన ఆటంకాలు
- నెరవేరనున్న రైతుల కల

ఆ గ్రామం మెట్ట ప్రాంతంలో ఉంది. మిడ్‌మానేరు, తోటపల్లి రిజర్వాయర్ కా లువల ద్వారా సాగునీరందుతుందని ఎంతో ఆశపడ్డ రైతులకు సాగునీరందకుండా పోయింది. కాలువల నిర్మాణం కోసం భూసేకరణ చేపట్టినా... కొంతమంది రైతుల మూలంగా అనేక ఆటంకాలు ఎదురయ్యాయి. దీంతో కాలువ పనులు రెండేళ్లుగా నిలిచిపోయాయి. కాలువ పనులు పూర్తయితే మెట్ట ప్రాంతంలోని రైతులకు చాలా మేలు జరుగుతుందని భావిస్తున్నా, సాగునీరందడం గగనంగా మారింది.


కాలువకు ఇరువైపుల పోస్తున్న మట్టి


జేసీబీ, టిప్పర్లతో మట్టి తరలింపు

మానకొండూర్: ఇటీవల ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గ్రామ పంచాయతీ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకాగా సాగునీరు రావడం లేదని రైతులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. త్వరలో కాలువల నిర్మాణం పూర్తి చేయిస్తామని అక్కడే ఉన్న జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ రైతులకు హామీ ఇచ్చారు. ఈమేరకూ మళ్లీ పనులు ప్రారంభం కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్లుగా ఎదురుచూపు

మానకొండూర్ మండలంలోని నిజాయితీగూడెం గ్రామం మెట్ట ప్రాంతలో ఉంటుంది. గ్రామంలో సుమారు ఎనిమిది వందల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. సాగునీరు లేక అక్కడి రైతులు వ్యవసాయబావులు, కుంటలపై ఆధారపడి ఆరుతడి పంటలు మొక్కజొన్న, వేరుశనగ, ఆకుకూరలు, కూరగాయల సాగు చేస్తున్నారు. మిడ్‌మానేరు, తోటపల్లి రిజర్వాయర్ ద్వారా సాగునీరు ప్రాంతానికి రానుందని తెలిసి రైతులు చాలా సంతోషపడ్డారు. కానీ ఎంఎంఆర్ 4 ఎల్ ఉపకాలువ పరిధిలోని 12 ఆర్ కాలువ ద్వారా నిజాయితీగూడెం గ్రామానికి సాగునీరు ఇచ్చేందుకు అధికారులు భూసేకరణ చేసి కాలువ నిర్మాణ పనులు రెండేళ్ల క్రితం చేపట్టారు. అయినా కాలువ నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది

ఆది నుంచి ఆటంకాలే

12 ఆర్ మైనర్ ఉపకాలువ సుమారు 2.4 కిలోమీటర్లు చేపట్టాల్సి ఉంది. దీని నిర్మాణం కోసం 30 మంది రైతుల నుంచి 15 ఎకరాలు భూసేకరణ చేశారు. అయితే పలువురు రైతుల అభ్యంతరాలతో కాలువ నిర్మాణానికి ఆది నుంచి ఆటంకాలే ఎదురయ్యాయా. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వరకూ కాలువ నిర్మాణ పనులు పూర్తయినా అక్కడి నుంచి పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఇటీవల సాగునీరు విడుదల చేయగా కాలువ తెగి సాగునీరు పంటపొలాల మీదుగా పారింది. కాలువ చివరి వరకూ సాగునీరు వెళ్లడం లేదని, గ్రామానికి చెందిన ఓ రైతు భూమిలో నుంచి కాలువ నిర్మాణం పూర్తి చేస్తే చివరి వరకూ అందుతుందని ఎమ్మెల్యేతో రైతులు ఇటీవల మొరపెట్టుకున్నారు.

రైతుల సంతోషం

రెండేళ్లుగా నత్తనడకన కొనసాగిన పనులు ఎట్టకేలకు మొదలయ్యాయి. ఎత్తు భాగంలో ఉన్న మట్టిని లోలెవల్ వద్ద కాలువకు ఇరువైపుల ట్రిప్పర్ల ద్వారా పోస్తున్నారు. అక్కడక్కడ కాలువలో బండరాళ్లను బ్లాస్టింగ్‌ద్వారా తొలగిస్తున్నారు. వారం పదిరోజుల్లో కాలువ పనులు పూర్తవుతాయని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. పనులు ప్రారంభం కావడం రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కాలువ తెగిపోయింది



సాగునీరు చివరి వరకూ పోవడం లేదు. నాలుగు రోజుల క్రితం కాలువ ద్వారా నీరు నాభూమి వద్దకు వచ్చి ఆగిపోవడంతో కాలువ తెగి నీరు వృథాగా పోయింది. ముందుకు కాలువ నిర్మాణం సరిగా లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చింది. కాలువ నిర్మాణం పూర్తయితే రైతాంగానికి మేలు జరుగుతుంది. రెండు పంటలు పండుతాయి.

– నండెసారి వీరయ్య, నిజాయితీగూడెం

రైతులు సహకరించాలి



ఎంఎంఆర్ 4 ఎల్ ఉపకాలువకు 11 ఆర్, 12 ఆర్, 13 మైనర్ ఉపకాలువలు ఉన్నాయి. వీటి పరిధిలోని రైతులతో సమస్యలున్నాయి. రైతులు సహకరిస్తే కాలువల నిర్మాణం పూర్తవుతుంది. 12 ఆర్ కాలువ పనులు వారం పది రోజుల్లో పూర్తి చేస్తాం. పనులు రెండు రోజులు క్రితం ప్రారంభించాం. కాలువ చివరి పంట పొలాలకు సాగునీరందిస్తాం.

– సదయ్య, డీఈ

నూతన కార్యవర్గం, కమిటీలు

బీజేపీ దళిత మోర్చా సైదాపూర్ మండల అధ్యక్షుడిగా రాహుల్



సైదాపూర్: బీజేపీ దళిత మోర్చా మండల అధ్యక్షుడిగా మాడెపు రాహుల్‌ను నియమించామని పార్టీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి రాహుల్ చేస్తున్న కృషిని అభినందించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా, అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్, కృష్ణారెడ్డి తదితరులకు రాహుల్ కృతజ్ఞతలు తెలిపారు.

పారువెల్ల యాదవ సంఘం కార్యవర్గం


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

గన్నేరువరం: మండలంలోని పారువెల్ల గ్రామ యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సంఘం సభ్యులు సమావేశమై ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏడుమ్యాకల కనకయ్య, ఉపాధ్యక్షుడిగా ఎలుక రాజు, కోశాధికారిగా చౌదరి మల్లేశం, డైరెక్టర్లుగా చౌదరి అనిల్, దుగ్యాని కనకయ్య, సందవేని అంజయ్య, ఎలుక పెద్ద ఎల్లయ్య నియామకమయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధితో పాటు సభ్యుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు సంగు కనుకయ్య, ఎలుక కనుకయ్య, సంగు వేణు, ఎలుక నర్సయ్య, ఏడుమ్యాకల అంజయ్య, సంగు శ్రీను, ఏడుమ్యాకల అంజయ్య పాల్గొన్నారు.

పురుషుల పొదుపు సంఘం పాలకవర్గం


సమావేశమైన పొదుపు సంఘం సభ్యులు

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ గ్రామంలో పురుషుల పొదుపు సంఘం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం సంఘం కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో గతేడాది ఆదాయ వ్యయాలపై చర్చించారు. హుస్నాబాద్ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు రంగు తిరుపతి ఆధ్వర్యంలో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ముందుగా 12 మంది డైరెక్టర్లను, అనంతరం బింగి లక్ష్మీనారాయణను అధ్యక్షుడిగా, పిల్లి రమేశ్‌ను ఉపాధ్యక్షుడిగా మరో పదిమంది కుమారస్వామి, సుధాకర్‌రెడ్డి, మొగిలి, సంతోష్‌రెడ్డి, సతీష్, అజయ్, రాజేంద్రప్రసాద్, రవి, శ్రీనివాస్‌తో పాటు పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు.

బీఆర్‌ఎస్ ఎస్సీసెల్ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మల్లేశం


నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రసమయి

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీకి చెందిన సంగుపట్ల మల్లేశం బీఆర్‌ఎస్ మానకొండూర్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈమేరకు ఎమ్మెల్యే ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, దళితుల అభ్యున్నతికి సహకరిస్తానన్నారు. నియామకానికి కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీఆర్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఆత్మ కమిటీ చైర్మన్ పాశం అశోక్ రెడ్డి, మాజీ సర్పంచ్ కిన్నెర సారయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


గోపాల్‌రావుపేటలో చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

రామడుగు: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పని చేస్తున్నారని, రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటింటికీ తిరుగుతూ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. అనంతరం మార్కెట్ యార్డులో హమాలీలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చాడ ప్రభాకర్‌రెడ్డి, కొండగట్టు దేవస్థానం కమిటీ సభ్యుడు దాసరి రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, మాజీ చైర్మన్ గంట్ల వెంకట్‌రెడ్డి, ఆర్‌ఐ రజనీ, నాయకులు కలిగేటి లక్ష్మణ్, నెరెళ్ల అంజయ్య, గుండి ప్రవీణ్, శ్రీనివాస్, అర్జున్, మల్లేశం, అరుణ్‌కుమార్, మల్లేశం, సురేష్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం


మొక్కలు నాటుతున్న అధికారులు, రైతులు

ఇల్లందకుంట: ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభదాయకమని మండల వ్యవసాయ అధికారిణి గుర్రం రజిత అన్నారు. శుక్రవారం మండలంలోని రైతులు ఒడ్డుల దేవేందర్‌రెడ్డి, కంకణాల రవీందర్ రెడ్డి పొలంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. సాగుకు ప్రభుత్వం 90శాతం రాయితీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు అందిస్తుందని, నాలుగేళ్ల వరకు ఏటా రూ.4,200 నిర్వహణకు అందజేస్తుందని తెలిపారు. పంట సాగుకు రైతులు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కందాల కొంరెల్లి, ఆర్ఎస్ఎస్ జిల్లా సభ్యులు కంకణాల సురేందర్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారులు ఐలయ్య, తిరపతి,వేణు, రైతులు దేవేందర్‌రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.


రామడుగు: రైతులతో మాట్లాడుతున్న ఏఈవో

నివారణ చర్యలు చేపట్టాలి

రామడుగు: రైతులు వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఏఈవో గోవర్ధన్ సూచించారు. మండలంలోని వన్నారం గ్రామంలో శుక్రవారం వరి పొలాలను పరిశీలించారు. రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. కార్యక్రమంలో గ్రామ రైతుబంధు కమిటీ కోఆర్డినేటర్ కొత్తూరి నారాయణ, జాడి రాజమల్లు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


బహుమతులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్‌లో జంతు సంరక్షణ పక్షోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జంతు సంరక్షణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంపీపీ రాణి సురేందర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాస్, సింగాపూర్ పశు వైద్యాధికారి రవీందర్‌రెడ్డి, జమ్మికుంట పశువైద్యాధికారి ప్లవన్‌కుమార్, చెల్పూర్ పశువైద్యాధికారి వీరేశం, హెచ్ఎం అంజయ్య, పశువైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'కు విశేష స్పందన


చిగురుమామిడిలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిగురుమామిడి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండో విడత కంటి వెలుగుకు విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం మండలంలోని చిన్నముల్కనూర్, చిగురుమామిడిలో నిర్వహించిన కంటి వెలుగు పరీక్షా కేంద్రాల్లో దాదాపు 620 మందికి పరీక్షలు చేశారు. అనంతరం పలువురికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రత్యూష, మండల వైద్యాధికారి ధర్మనారాయక్, ఆఫ్తాల్మిక్ తిప్పారపు శ్రీనివాస్, డీఓ మహేశ్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణకు సహకరించండి


రైతులతో సమావేశమైన ఆర్డీవో ఆనంద్‌కుమార్

కొత్తపల్లి: పద్మనగర్–ఎలగందుల రహదారి విస్తరణలో భాగంగా చేపట్టే భూ సేకరణకు రైతులు సహకరించాలని కరీంనగర్ ఆర్డీవో ఆనంద్‌కుమార్ కోరారు. కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ మొగిలి మంజుల సమ్మయ్య అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆర్డీఓ మాట్లాడుతూ నాలుగేళ్ల కిందట సర్వే చేసి నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. నోటిఫికేషన్ ప్రకారం భూ సేకరణ చేపట్టామని, అత్యధిక మార్కెట్ విలువ ప్రకారం రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తామని తెలిపారు. సుమారు 25 మంది రైతులకు సంబంధించిన 1.16 గుంటల భూమిని సేకరించి రహదారి విస్తరణ చేపడుతున్నట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి అభ్యంతరాలున్నా కలెక్టర్‌కు నివేదించుకోవచ్చునన్నారు. 4, 5 రోజుల్లో పూర్తిస్థాయి సర్వే చేపట్టి భూ సేకరణ చేపడతామని వెల్లడించారు. కాగా రైతులంతా భూమిని ఇచ్చేందుకు ఒప్పుకున్నప్పటికీ.. 66 ఫీట్లున్న రోడ్డును ప్రస్తుతం 100 ఫీట్లకు మార్చడం వల్ల కొంత భూమిని నష్టపోతున్నామని, అదేవిధంగా రహదారి ఎత్తులో నిర్మిస్తుండటం వల్ల తమ భూములకు నష్టం వాటిల్లనుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. తహసీల్దార్ గండె లక్ష్మీనరసింహారావు, ఆర్ఐ నర్సయ్య, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

31న మంత్రి కేటీఆర్ సభ

హుజూరాబాద్: ఈ నెల 31న నిర్వహించే మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ సభను విజయవంతం చేయాలని హుజూరాబాద్ సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండాల్ రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నియోజకవర్గంలోని సింగిల్ విండో చైర్మన్‌లతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, మంత్రి కేటీఆర్ సభకు అన్ని గ్రామాల నుంచి రైతులు భారీ సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో సింగిల్ విండోల అధ్యక్షులు కొరు సుగుణాకర్‌రెడ్డి, పొనగంటి సంపత్ , కట్టంగూరి శ్రీకాంత్ రెడ్డి, మావురపు విజయభాస్కర్‌రెడ్డి, ఉప్పుల తిరుపతి రెడ్డి, పోల్సాని వెంకటేశ్వరరావు, నాయకులు పోరెడ్డి శంతన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా పోచమ్మ బోనాలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని వెంకట్రావ్‌పల్లె గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో శుక్రవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనంతో డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ కన్నబోయిన తిరుమలతిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

చిగురుమామిడి: చిగురుమామిడి శివారులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో షష్టితిథి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఆలయంలోని శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వైభవోపేతంగా పంచామృత సహిత, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్, వరంగల్, జనగాం, జమ్మికుంట, సిద్దిపేట, కరీంనగర్, కోహెడ, తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. న్యాయవాదులు బద్దిపడగ రాజిరెడ్డి, కన్నోజు రామకృష్ణ, ఆలయ ధర్మకర్తలు, భక్తులు మోహన్‌రెడ్డి, అమర్, కనకయ్య, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.


వీణవంక: శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా పూజలు చేస్తున్న వేద పండితులు


వెంకట్రావ్‌పల్లెలో బోనాలతో వెళ్తున్న మహిళలు

ముగిసిన శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీభూనీలా సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ప్రముఖ జ్యోతిష్య వాస్తు పండితులు నమిలకొండ రమణాచార్యులు ఆధ్వర్యంలో ఐదురోజులుగా చేపట్టిన బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు మహా పూర్ణాహుతి, చక్రస్నానం, ద్వాదశరాధన, సప్తావరణ, ఏకాంత సేవ నిర్వహించారు. దేవుడి దృష్టిలో అందరూ ఒకటేనని వేద పండితులు పేర్కొన్నారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రమణారెడ్డి, సర్పంచ్ సుజాతకిషన్ రెడ్డి,గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.


చిగురుమామిడి: ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

- **మేయర్ పూజలు**

కరీంనగర్‌కల్చరల్: భాగ్యనగర్ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం మేయర్ సునీల్ రావు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.